నమస్తే తెలంగాణ
వరంగల్ హనుమకొండ
5 శనివారం 4 మే 2024 WARANGAL HANUMAKONDA

# రాకేశ్‌రెడ్డికి ఎమ్మెల్సీ చాన్స్

- వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా ఏనుగుల
- ప్రకటించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్



హనుమకొండ, మే 3 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఏనుగుల రాకేశ్‌రెడ్డికి అవకాశం దక్కింది. ఈమేరకు శుక్రవారం సాయంత్రం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించారు. ఇక్కడ ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహించిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామ ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఇందుకుగాను కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసింది. నల్లగొండ కలెక్టర్ ఈ నెల 2న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయగా అదే రోజు నుంచి 9వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 10న నామినేషన్ల పరిశీలన, 13వరకు నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు విధించారు. ఈ నెల 27వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగనున్నది. జూన్ 5న ఓట్లు లెక్కిస్తారు. అధికారులు వెల్లడించిన తుది ఓటర్ల జాబితా ప్రకారం పట్టభద్రుల నియోజకవర్గంలో మొత్తం 4,61,806 మంది ఓటర్లు ఉండగా వీరిలో మహిళా ఓటర్లు 1,74,794, పురుషులు 2,87,007 మంది, ట్రాన్స్‌జెండర్లు ఐదుగురు ఉన్నారు. కాగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,67,853 మంది ఓటర్లు ఉన్నారు.


**సామాన్య కుటుంబం నుంచి**

రాకేశ్‌రెడ్డిది సామాన్య రైతు కుటుంబం. ఆయన స్వగ్రామం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని వంగపహాడ్. రాకేశ్‌రెడ్డి బిట్స్ పిలానీలో మాస్టర్ మేనేజ్‌మెంట్ స్టడీస్(ఎంఎంఎస్), మాస్టర్ ఇన్ ఫైనాన్స్(ఎంఎస్) పూర్తి చేశారు. సిటీ బ్యాంక్ మేనేజర్‌గా, జేపీ మోర్గాన్, ఫేస్‌బుక్ లాంటి పలు అంతర్జాతీయ కార్పొరేట్ కంపెనీల్లో బెంగళూరు, అమెరికాల్లో ఏడేళ్ల పాటు ఉద్యోగాలు చేసి రాజకీయాలపై ఆసక్తితో వచ్చారు. 2013లో భారతీయ జనతా పార్టీ ద్వారా ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టి అంచెలంచెలుగా ఎదుగుతూ బీజేపీలో బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర అధికార ప్రతినిధిగా పనిచేశారు. వరంగల్ కేంద్రంగా అనేక ఆధ్యాత్మిక, సామాజిక, సేవా కార్యక్రమాలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు రాకేశ్‌రెడ్డి బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. ఈమేరకు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా రాకేశ్‌రెడ్డి పేరును బీఆర్ఎస్ ఖరారు చేసింది. అధిష్ఠానం నిర్ణయించిన తేదీన నామినేషన్ వేస్తానని రాకేశ్‌రెడ్డి తెలిపారు.



వరంగల్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం, ఎంపీ అభ్యర్థి సుధీర్ కుమార్

# నమ్మకానికి, నయవంచనకు మధ్య పోటీ




సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్, పక్కన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

- అమలు కాని హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్
- జనగామ ఎమ్మెల్యే పల్లా
- తండ్రి నకిలీ దళితుడు.. బిడ్డ డబుల్ నకిలీ
- మాజీ ఎమ్మెల్యే రాజయ్య
- అరూరి, కావ్య ఒకే గూటి నుంచి వచ్చారు
- వరంగల్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్
- సోడాషపల్లిలో సన్నాహక సమావేశం

వేలేరు, మే 3 : వరంగల్ లోక్‌సభ ఎన్నికలు ప్రజల నమ్మకానికి, నయవంచనకు మధ్య పోటీ అని, అమలు కాని హామీలతో కాంగ్రెస్ అధికారంలో వచ్చిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం వేలేరు మండలం సోడాషపల్లిలో వేలేరు, ధర్మసాగర్ మండలాల కార్యకర్తల విస్తృత స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కడియం శ్రీహరి ఉప ముఖ్యమంత్రిగా ఉండి స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఏం అభివృద్ధి చేశాడో చెప్పాలని అన్నారు. నాడు ఎమ్మెల్యే రాజయ్య అభివృద్ధి చేస్తుంటే కడియం శ్రీహరి అడ్డుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. ఉద్యమ నేతకు, ఉద్యమ ద్రోహికి మధ్య జరిగే ఎన్నికల్లో ప్రజలు ఎవరిని గెలిపిస్తారో చూద్దామని సవాల్ విసిరారు. మాజీ ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడుతూ.. తండ్రి నకిలీ దళితుడు అయితే కూతురు డబుల్ నకిలీ అని విమర్శించారు. దళిత దొర, దళిత ద్రోహి అయిన కడియంను బొంద పెట్టడానికి ప్రజలు గడ్డపార, పార పట్టుకుని చూస్తున్నారన్నారు. ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని చెప్పిన కడియం ఆ పార్టీలోకి ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. ఆరు నెలల్లో కాంగ్రెస్ పార్టీని కడియం శ్రీహరే ముంచుతారని జోస్యం చెప్పారు. స్టేషన్ ఘన్‌పూర్ అభివృద్ధి విరోధి కడియం శ్రీహరి అని, తాను ఎన్నో అభివృద్ధి పనులను మంజూరు చేయిస్తే కడియం అడ్డుకున్నాడని పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉండి నియోజకవర్గంలో సుమారు 1.39 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తే కాంగ్రెస్ పార్టీ వచ్చి కరువు తీసుకొచ్చిందని విమర్శించారు. కడియం కావ్యకు డిపాజిట్ కూడా రాకుండా బుద్ధి చెప్పాలని, ఉద్యమనేత సుధీర్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. అరూరి రమేశ్, కడియం కావ్య ఒకే పుట్టలో నుంచి వచ్చారని విమర్శించారు. కడియం శ్రీహరి, అరూరి రమేశ్ ఏమేమో మాట్లాడుతున్నారని, నిజ నిర్ధారణకు ఇద్దరికీ నార్కోటిక్ పరీక్షలు నిర్వహించాలన్నారు. రైతులను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి రైతులు, ప్రజలు ఓటుతోనే బుద్ధి చెప్పాలని కోరారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మరిజె నర్సింహారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వేలేరు జడ్పీటీసీ చాడ సరితారెడ్డి, కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి, ధర్మసాగర్ మండలాధ్యక్షుడు రాజు, ఎంపీటీసీలు సంధ్య, జ్యోతి పాల్గొన్నారు.

## పార్టీని వీడిన ద్రోహులకు గుణపాఠం చెప్పాలి

**బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్**

వరంగల్, మే 3 : పదవులు పొంది తమ స్వార్థం కోసం పార్టీ వీడిన నయవంచకులకు ఓటుతో గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. శుక్రవారం 11, 29 డివిజన్లలో బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌తో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. రామన్నపేట, పాపయ్యపేట చమన్, పోతననగర్, రంగంపేట ప్రాంతాల్లో ప్రజలను కలిసి బీఆర్ఎస్ అభ్యర్థికి ఓటెయ్యాలని కోరారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున యువత బీఆర్ఎస్‌లో చేరారు. కేసీఆర్ పంటలకు నీరందిస్తే కాంగ్రెస్ కరువు తెచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ హామీలను అమలు చేసే వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. కేసీఆర్ బస్సు యాత్రకు వస్తున్న అనూహ్య స్పందనకు భయపడి ఆయన ప్రచారాన్ని ఆపారన్నారు. కాంగ్రెస్, బీజేపీకి బుద్ధి చెప్పాలని అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒక్కటేనని, వారికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో సదాంత్, ఎండీ షఫీ, గుండు శ్రీనివాస్, శ్రీనివాస్, రాము పాల్గొన్నారు.




చెన్నూరులో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి, పక్కన ఎమ్మెల్సీ సిరికొండ

# అబద్ధాల కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

- హామీలను నెరవేర్చడంలో విఫలం
- రుణమాఫీ పేరుతో సీఎం రేవంత్ మోసం
- ప్రజల గొంతుక బీఆర్ఎస్ పార్టీనే
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- మతవిద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీ : ఎమ్మెల్సీ మధుసూదనాచారి

పాలకుర్తి రూరల్, మే 3 : అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలు, 420 హామీల పేర మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయనందున ఆ పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులను ప్రజలు నిలదీయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారితో కలిసి పాలకుర్తి మండలంలోని గ్రామాల్లో సన్నాహక సమావేశాల్లో ఎర్రబెల్లి పాల్గొని మాట్లాడారు. కేవలం ఐదు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. ఆగస్టు 15లోపు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ప్రమాణం చేస్తూ దొంగ ఒట్లు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి మాటలన్నీ అబద్ధాలేనని పేర్కొన్నారు. ప్రజలను మోసం చేయడంలో రేవంత్‌రెడ్డిని మించిన నాయకుడు లేడన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తోడు దొంగలని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీలకు బుద్ధి చెప్పి బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు.

**కడియం ఓ బ్రోకర్..**

బీఆర్ఎస్ కార్యకర్తల కష్టార్జితంతో ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి అధికార దాహంతో కాంగ్రెస్‌లో చేరిన ఓ రాజకీయ బ్రోకర్ అని ఎర్రబెల్లి విమర్శించారు. శ్రీహరికి రాజకీయ జీవితం తాను పెట్టిన భిక్షే నన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, జడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, జీసీసీ మాజీ చైర్మన్ ధరావత్ గాంధీనాయక్, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ మదార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముస్కు రాంబాబు, ఎఫ్ఎస్‌సీఎస్ బ్యాంక్ చైర్మన్ బొబ్బల ఆశోక్‌రెడ్డి, మాజీ చైర్మన్ అడ్డూరి మాధవరావు, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, మాజీ సర్పంచ్‌లు వీరమనేని యాకాంతారావు, ఇమ్మడి ప్రకాశ్, నకీర్త యాకయ్య, మాటూరి యాకయ్య పాల్గొన్నారు.

### కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి : సిరికొండ

అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి వాటిని నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ పార్టీని ఎండగట్టాలని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి కోరారు. బీఆర్ఎస్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త, నాయకుడు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతదేశంలో అన్ని రంగాల్లో వెనుకబడిన తెలంగాణ ఉద్యమ నేత కేసీఆర్ సీఎం అయ్యాకే అభివృద్ధి సాధించిందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. బీజేపీ మతం పేరుతో రాజకీయం చేస్తోందని ధ్వజమెత్తారు. ప్రజల గొంతుకై పోరాడే ఇంటి పార్టీ బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు.




ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న సీపీ అంబర్ కిశోర్ ఝా

## నిర్భయంగా ఓటు వేయాలి: సీపీ

పోచమ్మమైదాన్, మే 3: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా కోరారు. సెంట్రల్ జోన్ పోలీసుల ఆధ్వర్యంలో మట్టెవాడ, ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం పోలీసు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పోచమ్మమైదాన్ నుంచి మండిబజార్, వరంగల్ చౌరస్తా, వరంగల్ రైల్వేస్టేషన్ వరకు కవాతు కొనసాగింది. అర్బన్‌లో ఓటింగ్ శాతం పెంచేందుకు, ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కవాతు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీపీ అబ్దుల్ బారి, ట్రైనీ ఐపీఎస్ శుభం నాగ్, సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ భగత్, ఏసీపీలు నందిరాంనాయక్, దేవేందర్‌రెడ్డి, తిరుమల్, అధికారులు పాల్గొన్నారు.

## కేయూ డిగ్రీ పరీక్షలు యథాతథం

హనుమకొండ చౌరస్తా, మే 3 : కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్ పరీక్షలు ముందుగా ప్రకటించిన విధంగానే నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి నరసింహాచారి స్పష్టం చేశారు. విద్యార్థులు హాల్‌టికెట్లను సంబంధిత కాలేజీల నుంచి తీసుకోవచ్చని, పరీక్షలు వాయిదా అంటూ వివిధ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలను నమ్మవద్దని ఆయన విద్యార్థులకు ఒక ప్రకటనలో సూచించారు.

## మామునూరు ఎయిర్‌పోర్టు పరిశీలన

కరీమాబాద్, మే 3 : మామునూరు ఎయిర్‌పోర్టును ఢిల్లీ నుంచి వచ్చిన ప్రతినిధులు శుక్రవారం పరిశీలించారు. మామునూరు ఎయిర్‌పోర్టులో విమాన సేవలను ప్రారంభించేందుకు కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ప్రతినిధులు రావడంతో పనుల్లో వేగం పెరుగుతున్నట్లు సమాచారం.

## సమస్యాత్మక కేంద్రాలపై దృష్టి పెట్టాలి

**ఎన్నికల పరిశీలకురాలు బండారు స్వాగత్ రణ్వీర్ చంద్**




సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకురాలు బండారు స్వాగత్ రణ్వీర్ చంద్, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, మే 3 : సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్ర సాధారణ ఎన్నికల పరిశీలకురాలు బండారు స్వాగత్ రణ్వీర్ చంద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి తూర్పు నియోజకవర్గ పరిధిలోని సీకేఎం కళాశాల, చార్‌బౌళి వాటర్ ట్యాంక్, శంభునిపేట హైస్కూల్, శివనగర్, కౌటిల్య, ఆర్య హైస్కూల్‌లోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై ఆమె పలు సూచనలు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కేంద్రాల పరిధిలోని పోలీసు కేసుల వివరాలపై ఆరా తీశారు. ఎలక్టోరల్ అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసు శాఖ సేవలు వినియోగించుకోవాలని ఆదేశించారు. కేంద్రాల వద్ద తాగునీటితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ నందిరాం నాయక్, తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్‌రావు, జలపతిరెడ్డి, ఆర్ఐ కీర్తన్ పాల్గొన్నారు.



భద్రకాళి ఆలయానికి వెళ్లే రోడ్డులో గ్రీన్ నెట్ కట్టుకొని పనిచేస్తున్న కార్మికులు

# సెగలసూరీడు..



- కొమ్ములవంచలో అత్యధికంగా 46.4 డిగ్రీలు
- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఎండకు దెబ్బకు జనం విలవిల
- ఇప్పటికే పదుల సంఖ్యలో మృత్యువాత

భానుడు నిప్పులు కక్కుతున్నాడు. రోజుకో డిగ్రీ చొప్పున పెరుగుతూ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా ఎండ దెబ్బకు జనం విలవిల్లాడుతున్నారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం కొమ్ములవంచలో గరిష్ఠంగా 46.4 డిగ్రీలు నమోదైంది. ఇప్పటికే ఎండవేడిమికి ఉమ్మడి జిల్లాలో పదుల సంఖ్యలో పిట్టల్లా రాలగా శుక్రవారం ఒక్క వరంగల్ జిల్లాలోనే ముగ్గురు వడదెబ్బతో మృతి చెందారు. మరికొద్ది రోజుల్లో మరింత పెరిగే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ ప్రకటనతో ప్రజల్లో ఆందోళన మొదలైంది. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, అత్యవసరమైతే గొడుగుతో బయటకు రావాలని అధికారులు, వైద్యులు సూచిస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో శుక్రవారం నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతలు**

| | |
|---|---|
| 46.4 | కొమ్ములవంచ(నర్సింహులపేట) |
| 46.3 | చెల్పూర్(భూపాలపల్లి), గొర్రెకుంట(వరంగల్) |
| 46.2 | మల్లూరు(ములుగు) |
| 46.1 | జఫర్‌గఢ్ (జనగామ) |



వరంగల్‌లో ప్రయాణికులకు చల్లదనం కోసం ఆటోపై సంచుల్లో మట్టి పోసి వరి, గోధుమ నారును పెంచుతున్న ఆటో డ్రైవర్ రామచందర్

## వడదెబ్బతో ముగ్గురి మృతి



మల్లయ్య(ఫైల్)



మంగ్యా (ఫైల్)

గీసుగొండ/నర్సంపేట రూరల్/గిర్మాజీపేట, మే 3: వరంగల్ జిల్లాలో వడదెబ్బతో ముగ్గురు మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం గ్రామానికి చెందిన రైతు వేల్పుల శ్రీనివాస్(55) తన మక్కజొన్న చేనును కోసిన తర్వాత మక్కలను ఆరబెట్టేందుకు ఎండలో పనిచేయగా వడదెబ్బ తగిలింది. ఈ క్రమంలో గురువారం రాత్రి అపస్మారక స్థితికి చేరుకొని వాంతులు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించేలోపే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

- నర్సంపేట మండలం ఇప్పల్‌తండాకు చెందిన రైతు అజ్మీరా మంగ్యానాయక్(44) మూడు రోజులుగా మక్కజొన్న చేనులో కంకులను కూలీల సహాయంతో ఏరిస్తుండగా వడదెబ్బ తాకింది. వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గురువారం రాత్రి కుటుంబ సభ్యులు చికిత్స కోసం నర్సంపేటలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.
- వరంగల్ 33వ డివిజన్ ఎస్ఆర్ఆర్ తోటకు చెందిన రాయపురి మల్లయ్య(56) వ్యక్తిగత పనుల కోసం బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి చేరుకోగా అస్వస్థతకు గురయ్యాడు. అతడికి ప్రథమ చికిత్స అందించేలోగా మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



వరంగల్ దేశాయిపేట రోడ్ బృందావన్ కాలనీలోని ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకుంటున్న 108 ఏళ్ల సమ్మక్క

## ఓటేసిన శతాధిక వృద్ధురాలు

**వరంగల్‌లో హోం ఓటింగ్‌ను వినియోగించుకున్న 108 ఏళ్ల సమ్మక్క**

వరంగల్, మే 3 : లోక్‌సభ ఎన్నికల్లో శతాధిక వృద్ధురాలు ఇంటి వద్ద ఓటు హక్కును వినియోగించుకున్నది. హోం ఓటింగ్‌లో భాగంగా వరంగల్‌లోని దేశాయిపేట రోడ్ బృందావన్‌కాలనీకి చెందిన 108 ఏళ్ల సమ్మక్క తన ఇంట్లో పోలింగ్ అధికారులు, పోలీసుల సమక్షంలో ఓటు వేసింది. కుటుంబ సభ్యుల సహకారంలో వృద్ధురాలు వరంగల్ లోకసభ పరిధిలో తొలి ఓటు వేసింది. శుక్రవారం హోం ఓటింగ్‌లో వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాల్లో 121 మంది ఓటేసినట్లు అధికారులు తెలిపారు.




ఓటేస్తున్న వృద్ధురాలు